క్లుప్తంగా...

నేడు బతుకమ్మ సంబరాలు

బౌద్ధనగర్: చిలకలగూడలోని కట్టమైసమ్మ దేవాలయం ఎదురుగా ఉన్న మున్సిపల్ గ్రౌండ్‌లో ఈ నెల 20(నేడు) సాయంత్రం 6 గం. నుంచి రాత్రి 10 వరకు బతుకమ్మ సంబురాలు నిర్వహించనున్నట్లు స్వాతి చిత్ర కంబైన్స్ ఫిల్మ్ ప్రొడ్యూసర్ రవిప్రసాద్ గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ బతుకమ్మ సంబరాలకు కేంద్ర మంత్రులు స్మృతి ఇరానీ, కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్, తెలుగు నిర్మాతల మండలి ఫిలిం ఛాంబర్ కార్యదర్శి తుమ్మల ప్రసన్న హాజరవుతారన్నారు.

స్టూడెంట్స్ మేనిఫెస్టో విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఏబీవీపీ నాయకులు స్టూడెంట్ మేనిఫెస్టోను విడుదల చేశారు. గురువారం ఆర్ట్స్ కాలేజీ న్యూ సెమినార్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల జాన్సీ మేనిఫెస్టోను విడుదల చేసి మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలు స్టూడెంట్ మేనిఫెస్టోను ఆయా పార్టీల మేనిఫెస్టోలో చేర్చాలని డిమాండ్ చేశారు. మేనిఫెస్టోలో విద్యార్థి, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని పేర్కొన్నారు. వాటితో పాటు మూతపడిన 8624 పాఠశాలలను పునః ప్రారంభించి వర్సిటీల్లో సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులను రెగ్యులరైజ్, బ్లాక్‌గ్రాంట్స్ నిధులు పెంచాలని, వర్సిటీల్లో ఖాళీగా టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని మేనిఫెస్టోలో పేర్కొన్నట్లు వివరించారు. కమల్, సురేష్, పృథ్వీతేజ, జీవన్, శ్రీరామ్, రాజు, మహేష్, హరిప్రసాద్, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

చిలకలగూడ : శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ 46వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఐదో రోజైన గురువారం ఆలయ ప్రాంగణంలో పద్మావతి, గోదా సమేత ప్రసన్న వెంకన్నస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. ఉత్సవమూర్తులకు పట్టు వస్త్రాలతో అలంకరించి, మేళతాళాలు, బాజాభజంత్రీలు, మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ స్వామి వారి కల్యాణం, తిరుప్పావడసేవ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం సింహ వాహన అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ఈఓ రాజేష్ కుమార్, ధర్మకర్తల మండలి చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, వైస్ చైర్మన్ వేణు గోపాలరావు తెలిపారు.

చేనేతకు ప్రత్యేక స్థానం

కంటోన్మెంట్: భారతీయ సంస్కృతిలో సిల్క్, హ్యాండ్లూమ్ వస్త్ర ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని సినీతార భార్గవి అన్నారు. దసరా, దీపావళి పురస్కరించుకుని కంటోన్మెంట్ సిఖ్ విలేజ్‌లోని శ్రీ రాజరాజేశ్వరీ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన వీవ్స్ అండ్ క్రాఫ్ట్స్ వస్త్ర ప్రదర్శనను గురువారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. చేనేత వస్త్రాలపై నేటికి ఆదరణ తగ్గలేదన్నారు. నేటితరం కూడా హ్యాండ్లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారన్నారు. నిర్వాహకులు శ్రీలత మాట్లాడుతూ.. దసరా నవరాత్రుల స్పెషల్ కలెక్షన్ తో ఏర్పాటు చేసిన ఎక్స్‌పో ఈ నెల 26వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

సికింద్రాబాద్: రైలు ఢీకొని చికిత్స పొందుతున్న గుర్తుతెలియని మహిళ మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. గురువారం మేడ్చల్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరిన లోకల్ రైలు గుండ్ల పోచంపల్లి నుంచి బొల్లారం మధ్యలో పట్టాల పక్కనుంచి వెళ్తున్న మహిళ (30)ను ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆమెను అదే రైలులో బొల్లారం రైల్వేస్టేషన్‌కు తీసుకువచ్చి అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

రైల్వే స్టేషన్‌లో నల్లబెల్లం స్వాధీనం

సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని సారాయి తయారీలో ఉపయోగించే నల్లబెల్లాన్ని గుర్తించిన రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫారం–4లో జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా అక్కడే ఉన్న సంచుల్లో 150 కిలోల నల్లబెల్లాన్ని గుర్తించారు. నల్లబెల్లానికి సంబంధించిన వ్యక్తులెవరూ లేకపోవడంతో ఆ బెల్లాన్ని నాంపల్లిలోని ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

సెల్‌ఫోన్ చోరీచేసి.. పేటీఎంతో నగదు డ్రా చేసి

సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో చార్జింగ్ పెట్టిన ఓ ప్రయాణికుని సెల్‌ఫోన్‌ను దొంగిలించిన ఓ వ్యక్తి పేటీఎం ద్వారా నగదు కాజేశాడు. జీఆర్పీ పోలీసుల వివరాల ప్రకారం.. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాజానవగాన్‌కు చెందిన ముఖేష్ కుమార్ గత నెల 6న భార్యతో కలిసి నగరానికి వచ్చాడు. తిరిగి వెళ్లే క్రమంలో ఈ నెల 7న రైల్వే స్టేషన్‌లోని వెయిటింగ్ హాల్లో వేచి ఉన్న సమయంలో తన సెల్‌ఫోన్‌కు చార్జింగ్ పెట్టగా ఆ ఫోన్ చోరీకి గురైంది. దీంతో ముఖేష్‌కుమార్ తన కుమారుడికి ఫోన్‌చేసి తాను పోగొట్టుకున్న సెల్‌ఫోన్ నెంబర్‌పై మరో సిమ్ తీసుకోవాలని సూచించాడు. ఆ రోజు సాయంత్రం ఊరికి వెళ్లి చూసుకోగా తన నెంబర్‌పై ఉన్న పేటీఎం ద్వారా అప్పటికే రూ. 98 వేలు డ్రా అయినట్లు గుర్తించి తన సొంతూరి పోలీసులకు ఫిర్యాదు చేయగా గురువారం వారు సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు కేసును బదిలీ చేశారు.



కంటోన్మెంట్‌లో జంపింగ్ జపాంగ్!

- టికెట్ ఆశించి భంగపడుతున్న నేతలు
- మారుతున్న కండువాలు
- తికమకపడుతున్న కార్యకర్తలు

రసూల్‌పురా: ఎన్నికల సీజన్ మొదలవడంతో కంటోన్మెంట్‌లో వివిధ పార్టీల నేతలు జంపింగ్ జంపాంగ్ అంటున్నారు. టికెట్ల కేటాయింపులో తమకు అవకాశం దక్కలేదని కొందరు.. టికెట్ కోసం ప్రయత్నించి చివరికి రాదని తెలిసి వెంటనే పార్టీ కండువాలు మారుస్తున్నారు. ఓ పార్టీలో టికెట్ రాకుంటే వేరే పార్టీ తీర్థం పుచ్చుకుని టికెట్ కోసం తహతహలాడుతున్నారు. ఒక పార్టీలో ఉంటునే మరో పార్టీ నేతలతో రాయబారాలు నడుపుతున్నారు. పార్టీ ఆశించే అభ్యర్థులే కాకుండా కంటోన్మెంట్‌లో ద్వితీయ శ్రేణి నాయకులు కూడా ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో ఏ పార్టీ కండువా కప్పుకుంటారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా విడుదల చేస్తే టికెట్ రాని నేతలు ఇతర పార్టీల్లోకి ఎంతో మంది మారే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.

ఇయన రూటే సపరేటు.. ఐదు సార్లు జంపింగ్..

మాజీ మంత్రి గీతారెడ్డి శిష్యుడిగా ఉన్న శ్రీ గణేష్ రూటే సపరేటు. 2018 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో ఉన్న ఆయన ఆ పార్టీ టికెట్ ఇవ్వకపోవడంతో రాత్రికి రాత్రే బీజేపీలోకి చేరి ఆ పార్టీ టికెట్ సంపాదించి ఓటమి పాలయ్యారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఆ పార్టీలోకి జంప్ చేశారు. తన పేరు మీద ఫౌండేషన్ స్థాపించి సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజలతో మమేకమయ్యారు. ఎమ్మెల్యే సాయన్న మరణాంతరం సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ టికెట్ ఆయన కుమార్తె లాస్య నందితకు కేటాయించడంతో చివరి వరకు ప్రయత్నించి బీజేపీకి వెళ్లేందుకు ఆ నేతలతో టచ్‌లోకి వెళ్లారు. గత ఎన్నికల్లో టికెట్ ఇస్తే ఓడి బీఆర్ఎస్‌లోకి మారడంతో బీజేపీ నేతలు పట్టించుకోలేదు. ఆ తర్వాత లాస్య నందితతో కలిసి పార్టీలో ఏదైనా పదవి పొందాలని కేటీఆర్‌ను కలిసినా అనుకున్నంతా స్పందన లేకపోవడంతో కాంగ్రెస్‌లో చేరారు.

ఆరు నెలల ముందు నుంచే జంపింగ్ ప్లాన్..

కంటోన్మెంట్‌లో ఆరు నెలల ముందు నుంచే జంపింగ్ సీజన్ ప్రారంభమైంది. ఎన్నికల ప్రకటనకు ముందే పార్టీల మార్పులు మొదలయ్యాయి. కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్, బీజేపీ నుంచి కాంగ్రెస్‌కు అటు నుంచి ఇటు ఇటు నుంచి అటు పలువురు టికెట్ ఆశించే నాయకులు జంపింగ్ జపాంగ్ అన్నారు. కాంగ్రెస్ మాజీ మంత్రి శంకరరావు కుమార్తె సుష్మిత కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి, ఇక ముప్పిడి గోపాల్ కాంగ్రెస్ నుంచి బీజేపీ, తర్వాత బీఆర్ఎస్‌లో ఉంటూ ఎన్నికల షెడ్యూల్‌కు ముందే టీటీడీపీలోకి జంప్ చేశారు. టీడీపీ తరపున అల్వాల్ మున్సిపల్ చైర్మన్‌గా కొనసాగిన జీవకన్ కాంగ్రెస్‌లోకి.. కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు వి. జైప్రకాష్ మళ్లీ కాంగ్రెస్ గూటికి చేరారు. టీడీపీ నుంచి బీఆర్ఎస్‌కు జంప్ చేసిన విజయరామరావు ప్రస్తుతం బీజేపీలో కొనసాగుతున్నారు. .

ద్వితీయ శ్రేణి నాయకులకు పెరిగిన డిమాండ్.

కంటోన్మెంట్ రాజకీయాలపై మంచి పట్టున్న బోర్డు మాజీ ఉపాధ్యక్షులు బీజేపీలో కొనసాగుతున్న ద్వితీయ శ్రేణి నాయకులు బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, సదా కేశవరెడ్డి, బానుక మల్లికార్జున్‌లకు ప్రస్తుతం విపరీతంగా డిమాండ్ ఉంది. కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ ఆశిస్తున్న నాయకులు జీవకన్, నరసింహన్, శ్రీగణేష్, బీజేపీ నుంచి టికెట్ ఆశిస్తున్న సుష్మిత వీరిని పలుమార్లు కలిసి తమకు మద్దతు ఇవ్వాలని కోరారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి తమను సంప్రదించాడని కంటోన్మెంట్ టికెట్ ఎవరికి కేటాయించినా ఆ అభ్యర్థికి మద్దతు తెలిపి గెలిపించాలని కోరాడని చెప్పుకుంటూ వీరు తమ డిమాండ్‌ను పెంచుకుంటున్నారు. త్వరలో ఈ ముగ్గురు కాంగ్రెస్‌లోకి జంప్ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. వీరిలో జంపన ప్రతాప్ కాంగ్రెస్ నుంచి టీడీపీ, టీడీపీ నుంచి బీఆర్ఎస్, ఆ తర్వాత బీజేపీకి మారారు. ఇక కేశవరెడ్డి సైతం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీకి మారారు. భానుక మల్లికార్జున్ కాంగ్రెస్ నుంచి బీజేపీకి మారారు. మొత్తానికి కంటోన్మెంట్‌లో మాత్రం ఏ నాయకుడు ఎప్పుడు ఏ పార్టీలో చేరుతాడో అని వారి అనుచరులు తికమకపడుతున్నారు.

ఇలా వచ్చి..అలా దక్కించుకుని..

- సనత్‌నగర్ టికెట్ ఆశించి భంగపడ్డ ఎందరో నేతలు
- బరిలో కోట నీలిమా



సనత్‌నగర్: కోట నీలిమా..గత రెండు నెలల క్రితం వరకు సనత్‌నగర్ నియోజకవర్గ ప్రజలకు పరిచయం లేని పేరు. ఇక్కడి ప్రజలతో మమేకం కాకముందే అక్కడక్కడ ఆమె పేరిట వెలిసిన హోర్డింగ్‌లు చూసిన ప్రజానీకం ఎవరీ నీలిమా అంటూ ప్రశ్నల వర్షం సంధించారు. ఎక్కడో దేశ రాజధానిలో ఉండే నేషనల్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పవన్ ఖేరా సతీమణి కోట నీలిమాకు సనత్‌నగర్‌తో సంబంధం ఏమిటా..అని ఆ వెంటనే మరో ప్రశ్న. వారి ప్రశ్నలను పటాపంచల్ చేస్తూ ప్రజాసేవ చేయాలనే తపన ఉండాలే గానీ, నియోజకవర్గం ఏదైతే ఏంటీ అన్నట్లుగా ఆమె ఈ రెండు నెలల పాటు ప్రజాక్షేత్రంలో రాటు దేలారనే చెప్పాలి. ఈ రెండు మాసాల కాలంలో అడుగడుగునా ఆమెకు ఎదురైన ప్రతిబంధకాలు ఆమె రాజకీయ అనుభవానికి మరింత పదునుపెట్టాయి. కాంగ్రెస్‌లో సుదీర్ఘకాలం పాటు సేవలందించడమో లేక భర్త కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా ఉండడమో గానీ చివరకు అధిష్టానం సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి టికెట్ కేటాయించింది. కోట నీలిమా పేరు వినబడకముందే సరోజినీదేవీ కంటి ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్‌గౌడ్ టికెట్ ఆశిస్తూనే కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ తనదైన శైలిలో ముందుకెళ్తున్న సమయంలో కోట నీలిమా తెర మీదకు వచ్చింది. ఇదే క్రమంలో మర్రి శశిధర్‌రెడ్డి తనయుడు మర్రి ఆదిత్యారెడ్డి సైతం తనకే కాంగ్రెస్ టికెట్ దక్కుతుందన్న ఆశల పల్లకిలో ఊరేగుతూ వచ్చారు. ముగ్గురు నేతలు టికెట్ తమకేనంటూ ప్రజల్లో తిరుగుతూ విస్తృత ప్రచార పర్వం కొనసాగించారు. చివరకు కాంగ్రెస్ అధిష్టానం కోట నీలిమా వైపే మొగ్గు చూపింది.

అసంతృప్తులు సహకరించేనా..?

స్థానికంగా ఉండేవారికి కాకుండా ఎక్కడి నుంచో వచ్చిన కోట నీలిమాకు టికెట్ ఖరారు చేయడంతో ఆ పార్టీలో నేతలు సహకరిస్తారనేది తేలాల్సి ఉంది. ఇక్కడి నుంచే డాక్టర్ రవీందర్‌గౌడ్, మర్రి ఆదిత్యారెడ్డిలు టికెట్ కోసం అన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ దక్కకపోవడంతో వారు ఏమేర పార్టీ అభ్యర్థి నీలిమా గెలుపు కోసం ప్రయత్నం చేస్తారో చూడాలి. వారిరువురి వెంట సీనియర్ నేతలు నడుస్తూ వారు చేపట్టే కార్యక్రమాల్లో పాలుపంచుకుంటూ వచ్చారు. అయితే తమ అభిమాన నేతకు టికెట్ దక్కకపోవడంతో వారు ఎటువైపు నిలబడతారనేది ప్రశ్నార్థకం. చివరకు టికెట్ కోసం ప్రయత్నించిన రవీందర్‌గౌడ్, ఆదిత్యారెడ్డి ఎవరికి వారు తమదైన రీతిలో సామాజిక కార్యక్రమాలు చేపడుతూ వచ్చారు. ఇరువురి నేతల సామాజిక సేవకు తోడు కాంగ్రెస్ పార్టీపై అభిమానంతో వారి వెంట ఉన్న నేతలు ఇప్పుడు పూర్తిస్థాయిలో నీలిమా మద్దతుగా నిలుస్తారో లేదో అని నియోజకవర్గ వాసులు చర్చించుకుంటున్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



నాయకులతో చర్చిస్తున్న ఆర్‌ఓ కిషన్‌రావు

సనత్‌నగర్: ఎన్నికల కమిషన్ తీసుకువచ్చిన సంస్కరణలకు లోబడి రాజకీయ పార్టీలు వ్యవహరించాలని సనత్‌నగర్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కిషన్‌రావు సూచించారు. ఈ నెల 30 వరకు కొత్త ఓటరు నమోదు, మార్పులు చేర్పులకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. సికింద్రాబాద్ జోనల్ కార్యాలయ భవనంలోని ఆర్‌ఓ కార్యాలయంలో గురువారం రాజకీయ నాయకులతో సమావేశం ఏర్పాటుచేసి ఎన్నికల ప్రచారంలో అనుసరించాల్సిన విధి విధానాలను వివరించారు. గడువులోగా చిరునామా, ఇతరత్రా మార్పులు ఉంటే చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల విషయంలో ఏమైనా సందేహాలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ నాయకులపై పూర్తి స్థాయి నిఘా ఉంటుందన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై చర్యలు తీసుకునేలా సీవిజిల్ యాప్‌ను అందుబాటులోకి ఉంచామన్నారు. ఈ సమావేశంలో బేగంపేట డీసీ, ఏఆర్వో శంకర్, ఖైరతాబాద్ డీసీ జగన్, నాయకులు మర్రి శశిధర్‌రెడ్డి, అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

లాస్య నందితకు మద్దతుగా ప్రచారం



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నివేదిత

రసూల్‌పురా: బీఆర్ఎస్ కంటోన్మెంట్ నియోజకవర్గం అభ్యర్థి లాస్యనందితకు మద్దతుగా బోర్డు ఏడో వార్డు పరిధిలోని పలు బస్తీల్లో లాస్య సోదరి నివేదిత, మూడవ వార్డు పరిధిలో బోర్డు మాజీ సభ్యురాలు అనితా ప్రభాకర్ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ సభ్యులు నళినికిరణ్, నాగినేని సరిత, తేజ్‌పాల్, సుధాకర్, నవీన్, విశ్వనాథరాజు, రాధిక, రాజేష్ పాల్గొన్నారు.

- మూడో వార్డు పరిధిలోని ధోబీఘాట్‌లో రజక సంఘం నేతలతో బోర్డు మాజీ సభ్యురాలు అనిత ప్రభాకర్ సమావేశమై రజకుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్న సీఎం కేసీఆర్‌కు మద్దతుగా లాస్యనందితను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోమయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్, శంకర్, స్వామి, మహేందర్, శ్రీను, మురళి, గణేష్ కుమార్ పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి



తలసానికి హారతి పడుతున్న మహిళలు

బన్సీలాల్‌పేట్: ఎన్నికల్లో ప్రజలు తనను ఓటేసి మరోసారి ఆశీర్వదించాలని బీఆర్ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం మోండా మార్కెట్ డివిజన్ బండిమేట్‌లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎన్నికలు వచ్చినప్పుడే కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు గుర్తుకు వస్తారన్నారు. వీరి హయాంలో చేసిన అభివృద్ధి ఏంటో ప్రజలు అడగాలన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో 50 ఏళ్లలో జరగని అభివృద్ధి కేవలం పదేళ్లలో చేశామన్నారు. మాయమాటలతో ఓట్ల కోసం వచ్చే పార్టీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. తాము చేసిన ప్రజాభివృద్ధి తమకు ఎన్నికల్లో శ్రీరామరక్షగా ఉంటుందని సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్ఎస్ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అంతకు ముందు స్థానిక మహిళలు తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు మంగళహారతులతో స్వాగతం పలికారు.

కాంగ్రెస్ అసమ్మతి నాయకుల సమావేశం

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్‌ను ఆశించి నిరాశకు గురైన నోముల ప్రకాశ్‌రావుగౌడ్ దసరా తర్వాత తమ భవిష్యత్ కార్యచరణను ప్రకటిస్తా అన్నారు. గురువారం సీతాఫల్‌మండిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన అసమ్మతి నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో ముఖ్య నాయకులు, ఏ,బీ బ్లాక్‌ల అధ్యక్షులు తన వెంట ఉన్నారని సికింద్రాబాద్ టికెట్ విషయంలో మరోమారు ఆలోచించాలని అధిష్టానాన్ని కోరుతున్నానన్నారు. కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేయాలని నాయకులు, కార్యకర్తలు తనకు సూచిస్తున్నారని, దసరా తర్వాత మరో సమావేశాన్ని నిర్వహించి భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎం.ఆర్. శ్రీనివాస్, సురేష్ లాల్, జగదీశ్వరరావు, షకీల్ ఖాన్, మహ్మద్, వాహీదుద్దీన్, దేవేందర్‌రెడ్డి, అభిషేక్, దాము పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలి



షెడ్డుకు సీల్‌వేస్తున్న అధికారులు

సనత్‌నగర్: విధులకు ఆటంకం కలిగిస్తూ తమ పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ బేగంపేట ప్రకాష్‌నగర్ రామలింగేశ్వర స్వామి అర్చకుడు సదాశివుడు ఆలయ కార్యనిర్వహణాధికారి విఠలయ్యకు ఫిర్యాదు చేశారు. గత 26 ఏళ్లుగా తాను ఇదే ఆలయంలో అర్చకత్వం చేస్తున్నానని, గురువారం విధులు నిర్వర్తిస్తుండగా హీరాలాల్, నర్సింగరావు ఇద్దరు తమ పట్ల అసభ్యకర పదజాలంతో దూషించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మున్ముందు తమ విధులకు ఆటంకం కలగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

- బేగంపేట రామలింగేశ్వరస్వామి స్వామి దేవస్థానం స్థలంలో అక్రమంగా నిర్మించిన షెడ్డుకు ఈఓ విఠలయ్య గురువారం సీల్ వేశారు. గత కొంతకాలం క్రితం ఇక్కడి ఆలయ ప్రాంగణంలో అనుమతి లేకుండా షెడ్ నిర్మించి ఎలాంటి విగ్రహ ప్రతిష్ఠ చేయకుండా సిమెంట్‌తో తయారుచేసిన సాయిబాబా విగ్రహం పెట్టి భక్తుల నుంచి విరాళాలు వసూలు చేసుకోవడమే కాకుండా ఆలయ అర్చకులను అసభ్య పదజాలంతో దూషిస్తున్నారన్న ఫిర్యాదుల మేరకు హీరాలాల్ అనే వ్యక్తిపై తగిన చర్యలు తీసుకోవాలంటూ ఆయన బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.



నల్లపోచమ్మ దేవాలయంలో కుంకుమార్చనలో..



పూజలో పాల్గొన్న సారంగపాణి, గణేష్‌రావు

అమ్మ దర్శనం.. భక్తులు పరవశం

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను సికింద్రాబాద్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. అమ్మవారి మండపాలకు భక్తులు బారులుదీరి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆయా మండపాల్లో వెలిసిన అమ్మవార్లు రోజుకొక రూపంలో భక్తులకు దర్శనం ఇస్తున్నారు. పలు ప్రాంతాల్లో అన్నదానాలు, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుండంతో ఆ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటోంది. –సికింద్రాబాద్, సనత్‌నగర్ జోన్ల బృందం



కట్టమైసమ్మ అమ్మవారిని దర్శించుకున్న దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ



దుర్గామాతను దర్శించుకున్న మంత్రి మల్లారెడ్డి

'ఆరు గ్యారంటీ'లను అమలు చేస్తాం

లాలాపేట: తెంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఆదం సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌లో గురువారం ఆయన ప్రచారం చేస్తూ ఆరు గ్యారెంటీలను వివరించారు. ఈ సందర్భంగా మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన పలువురు యువకులు సంతోష్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ గెలుపునకు యువత కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నరేష్, రవి, బోదాసు నర్సింహ పాల్గొన్నారు.

అడ్డగుట్ట నా విజయానికి అడ్డా : పద్మారావు గౌడ్

అడ్డగుట్ట: అడ్డగుట్ట డివిజన్ తన గెలుపునకు అడ్డా అని సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన అడ్డగుట్టలోని ఏసీఎస్‌నగర్, బీ–సెక్షన్, లోహియా నగర్, నందనార్ నగర్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన గెలుపునకు అడ్డా అయినటువంటి అడ్డగుట్ట డివిజన్ నుంచే భారీ మెజారిటీ రానుందని ధీమా వ్యక్తం చేశారు. సికింద్రాబాద్‌లోని అన్ని బస్తీలు, కాలనీల్లో అభివృద్ధిలో సమతుల్యత సాధించామని, అందుకే అతిపెద్ద మురికివాడగా పేరున్న అడ్డగుట్ట ప్రాంతం గత తొమ్మిదేళ్లలో కొత్త రూపాన్ని ఏర్పరుచుకుందన్నారు. ప్రచారంలో కార్పొరేటర్లు లింగాని ప్రసన్నలక్ష్మి, సునీత, హేమ, బీఆర్ఎస్ నేతలు కిషోర్, కిరణ్, రామేశ్వర్, త్రినేత్ర, లింగాని శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, నక్క మధు, పెండెం మనోహర్, మధుగౌడ్, సత్తయ్యగౌడ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపిస్తాం: ఎంఐఎం నేతల తీర్మానం

సనత్‌నగర్: నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని ఎంఐఎం సనత్‌నగర్ అధ్యక్షుడు మహ్మద్ షౌఖత్ అన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గంలోని పలు డివిజన్లకు చెందిన ఎంఐఎం నేతలు గురువారం సమావేశమై ఏకగ్రీవ తీర్మానం చేశారు. షౌఖత్ మాట్లాడుతూ.. ఎంఐఎం పార్టీ అధిష్టానం సైతం నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి మద్దతుగా నిలవాలని తమకు ఆదేశాలు ఇచ్చిందని దీంతో తలసాని గెలుపునకు పాటు పడుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు షకీల్‌బేగ్, అశోక్, అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురం..మది నిండుగా ఆనందం..

సనత్‌నగర్, సికింద్రాబాద్, నియోజకవర్గాల్లో బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆయా కాలనీల మహిళలు, యువతులు రంగురంగుల పువ్వులతో అందంగా బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆడుతూ సందడి చేస్తున్నారు. జెక్ కాలనీ రెండో రోడ్డులోని సుబ్బరాజు అపార్ట్‌మెంట్ వద్ద గురువారం సాయంత్రం బతుకమ్మ పాటలతో హోరెత్తించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు చింతిరెడ్డి ప్రభ, ప్రధాన కార్యదర్శి, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎస్.అన్నపూర్ణ ఆదిలక్ష్మీదేవి, కేవీ రమణమ్మ, భాగ్యలత, విజయలక్ష్మీ, వాణి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. – సికింద్రాబాద్ /సనత్‌నగర్ జోన్ల బృందం



జెక్‌కాలనీ రెండో రోడ్డులోని సుబ్బరాజు అపార్ట్‌మెంట్ వద్ద..



ఓయూ ఇంజినీరింగ్ కాలేజీలో..



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న హోమ్ చిన్నారులు



బతుకమ్మ వేడుకల్లో టీఎస్‌పీసీబీ మహిళా ఉద్యోగులు